క్లుప్తంగా

టోల్‌గేట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



మంత్రి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: నిబంధనలకు విరుద్ధంగా టోల్ చార్జీలు వసూలు చేస్తున్న జొన్నాడ టోల్‌గేట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఇదే విషయమై ఆయన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విజయనగరం నుంచి విశాఖపట్నం వెళ్లే దారిలోని జొన్నాడ టోల్‌గేట్ వద్ద సిబ్బంది తమ ఇష్టానుసారంగా టోల్ చార్జీలు వసూలు చేస్తూ వినియోగదారులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. అలాగే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటిని బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ దాడులు



బొప్పడాం లోని ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ సింహాచలం తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం జంక్షన్‌లో ఉన్న రాజరాజేశ్వరి ఎరువుల దుకాణంపై విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలను, రిజిస్టర్‌లను తనిఖీ చేసి తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఎరువులకు సంబంధించి కొనుగోలు బిల్లులు లేకపోవడంతో పాటు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో షాపు యజమానిపై 6 ఎ కేసు నమోదు చేశామని రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాచలం తెలిపారు. సుమారు రూ.43,663 విలువ చేసే ఎరువులను సీజ్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపుకార్డుల పంపిణీ



విద్యార్థులతో వైఎస్సార్ సీపీ నాయకుడు నారాయణరావు

పూసపాటిరేగ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి పురస్కరించుకుని, మండలంలోని మత్స్యవానిపాలెం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు గుర్తింపుకార్డులు, టైలు మంగళవారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బావిశెట్టి నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లు రమేష్, పైల బంగారి, పైల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడండి



సీతారామునిపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత లక్ష్మణరావు

నెల్లిమర్ల రూరల్: మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో రైతులంతా నానో యూరియానే ఉపయోగించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణరావు సూచించారు. మండలంలోని సీతారామునిపేట, ఒమ్మి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నానో యూరియా సాధారణ యూరియా కన్నా చాలా తక్కువ మోతాదులో సరిపోతుందన్నారు. దీంతో రైతులకు ఎరువుల ఖర్చు గణనీయంగా తగ్గుతుందన్నారు. నానో యూరియా నైట్రోజన్ ఉపయోగశక్తిని 80 శాతం వరకు పెంచుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఎంతోగానో సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీలక్ష్మి, ఏఈవో శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడువు రెండు నెలలే..

విజయనగరం: లేఅవుట్ల క్రమబద్ధీకరణకు రెండు నెలలు మాత్రమే గడువు ఉందని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇదే విషయమై ఆయన తన కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించి, మాట్లాడారు. లే అవుట్ల క్రమబద్ధీకరణ విధానానికి మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉన్నందున ఈలోగా ప్రతిఒక్కరూ లేఅవుట్ క్రమబద్ధీకరణ చేసుకునే విధంగా చైతన్యం తీసుకురావాలన్నారు. అలాగే పెండింగ్‌లోని దరఖాస్తులను తక్షణమే పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టీపీవో అప్పలరాజు, టీపీఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు.

రాజన్నా.. నిను మరువం!

జనహృదయ నేత, సంక్షేమ ప్రదాత, అభివృద్ధి విధాత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వాడవాడలా మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరై వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. జలయజ్ఞం పేరుతో రైతు గుండెల్లో అపర భగీరథుడిగా, ఆరోగ్యశ్రీతో పేదల ఊపిరిగా, అభివృద్ధిని చేతల్లో చూపించిన అసలు సిసలైన నాయకుడిగా జనం గుండెల్లో సజీవుడిగా ఉన్నారని వక్తలు కొనియాడారు. మరో వందేళ్లు గడిచినా ఆయనను ఈ రాష్ట్ర ప్రజానీకం మరువదన్నారు. ఆయన ఆశయ సాధనకు మనవంతు కృషి చేయాలని కోరారు.

– విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్



విజయనగరం: దుప్పాడలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ అమర్ రహే అని నినాదాలు చేస్తున్న గ్రామస్తులు



పూసపాటిరేగ: కుమిలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



విజయనగరం: గూడ్స్ షెడ్ వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి, డిప్యూటీ మేయర్ శ్రావణి తదితరులు



నెల్లిమర్ల రూరల్: మొయిద గ్రామంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ సెల్ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన, తదితరులు



డెంకాడ: పెదతాడివాడలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తమ్మునాయుడు, తదితరులు



నెల్లిమర్ల రూరల్: కొండవెలగాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



భోగాపురంలో జరిగిన కార్యక్రమంలో జోహార్ వైఎస్సార్ అని నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, తదితరులు



నెల్లిమర్ల రూరల్: పూతికపేటలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ అమర్ రహే నినాదాలు చేస్తున్న నాయకులు

నేత్రదానానికి ముందుకు రావాలి

విజయనగరంఫోర్ట్: ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమం మేనేజర్ డాక్టర్ కె.త్రినాథరావు కోరారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని అరుంధతినగర్‌లో నేత్రదానంపై మంగళవారం అవగాహన కల్పించారు. మనం చేసే నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చన్న విషయం మర్చిపోవద్దన్నారు. దేశంలో 12 లక్షల మంది కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్నారన్నారు. ఏటా 25 నుంచి 30 వేలు కొత్త అంధత్వ కేసులు వస్తున్నాయని అయితే దేశ వ్యాప్తంగా కేవలం 50 వేల కార్నియాలు మాత్రమే సేకరించడం జరుగుతోందన్నారు. ఈ లోటును భర్తీ చేసే అవకాశం మన చేతుల్లోనే ఉందని, నేత్రదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.



డెంకాడ: నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


డెంకాడ: నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని మోపాడ పీహెచ్‌సీలో నేత్రదానంపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ శరణ్య, ఆప్తాలమిక్ అధికారి ఎం.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

• ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన



విజయనగరం జిల్లా కేంద్రంలోని చదురుగుడి ఆధ్యాత్మిక కళావేదిక వద్ద రామభద్రపురం మండలం, పాతరేగ గ్రామానికి చెందిన శ్రీకృష్ణ తప్పెటగుళ్ల బృందం మంగళవారం చేసిన తప్పెటగుళ్ల వాయిద్య ప్రదర్శన ఆకట్టుకుంది. 15 మంది సభ్యులు కలిగిన ఈ బృందం లయబద్ధంగా తప్పెటగుళ్లు వాయిస్తూ నృత్యం చేయడం చూపరులను అలరించింది. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

అక్రమ లైసెన్స్‌లు రద్దు చేయండి



మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న గో సంరక్షణ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని గోమాంసం అమ్మకానికి సంబంధించిన అక్రమ లైసెన్స్‌లను వెంటనే రద్దు చేయాలని ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జీవబంధు లోగీశ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ విజయనగరం కంటోన్మెంట్‌లో ఎనిమిది గోమాంసం అమ్ముకునే దుకాణాలకు అక్రమంగా ట్రేడ్ లైసెన్స్‌లు మంజూరు చేయడాన్ని తాము ఖండిస్తున్నట్లు తెలిపారు. గోవధకు ట్రేడ్ లైసెన్స్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తున్న మున్సిపల్ హెల్త్ అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ఆయన వెంట గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర నాయకురాలు గండికోట శాంతి తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందజేత

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఆలోవీ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు మంగళవారం చేపట్టారు. తొలుత స్క్రీనింగ్ టెస్ట్, అనంతరం గ్రూప్ డిస్కషన్ ఆ తర్వాత ఇంటర్వ్యూ నిర్వహించారు. అనంతరం ఎంపికైన 15 మందికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

భక్తిశ్రద్ధలతో చండీయాగం



చండీయాగం చేస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీపైడితల్లి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ దగ్గరున్న వనంగుడిలో చండీయాగం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు వెలువలపల్లి నరసింహామూర్తి వేదమంత్రోచ్ఛరణల నడుమ యాగ ప్రక్రియ చేపట్టారు. అనంతరం యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు తీర్థప్రసాదాలు అందజేశారు.

మోతీమహల్ పునఃప్రారంభం

విజయనగరం టౌన్: కోటలోని పునర్నిర్మించి ఆధునీకరించిన మోతీమహల్‌ను గోవా గవర్నర్, మాన్సాస్ చైర్మన్ పి.అశోక్ గజపతిరాజు, సునీలా గజపతిరాజులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.



మోతీమహల్ వద్ద గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ డీఈఈ త్రినాధరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో రామతీర్థం, సీతారామునిపేట, గొర్లిపేట, కొత్తపేట, సువ్వానిపేట, తుమ్మలపేట, దన్నానపేట, కోరాడపేట, తంగుడుబిల్లి, ఏటీ అగ్రహారం, ఆల్తిపాలెం, తమ్మాపురం గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఆస్పత్రి తనిఖీ

విజయనగరంఫోర్ట్: నగరంలోని ప్రభాకర్ ఆస్పత్రిని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి మంగళవారం తనిఖీ చేశారు. ఏఆర్‌టీ లెవల్ వన్ అనుమతి కోసం ఆస్పత్రి రిక్వెస్ట్ నమోదు చేసుకోవడంతో ఆమె ఆస్పత్రిని సందర్శించి, అందులోని వసతులను పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన మైక్రోస్కోప్, సెంటర్ ఫ్యూజ్, రిఫ్రిజిరేటర్ వంటి పరికరాలను చూసి పలు సూచనలు చేశారు. కౌన్సిలింగ్, ఐయూఐ ప్రాసెస్ మాత్రమే ఏఆర్‌టీ లెవల్ వన్‌లో అనుమతించబడుతుందని స్పష్టం చేశారు.

ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలి

విజయనగరంఫోర్ట్: ఆస్పత్రిని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని టీబీ ముక్త్ భారత్ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ టీమ్ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ సీరద సూచించారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే రోగులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలన్నారు. క్షయవ్యాధి ఒకరి నుంచి ఒకరికి త్వరగా వ్యాప్తి చెందుతుందని అందువల్ల అది ఇతరులకు సోకకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 32 మంది ఎంపిక

నెల్లిమర్ల: మండలంలోని జరజాపుపేటలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 32 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నగర పంచాయతీ వైఎస్ చైర్మన్ సముద్రపు రామారావు పర్యవేక్షణలో జరిగిన శిబిరానికి వచ్చిన వారికి కంటి వైద్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేశామన్నారు. అలాగే సర్జరీకి ఎంపికైనా వారికి ఉచితంగానే ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు.

అంతర పంటల సాగుతో అధిక లాభాలు

• జిల్లా ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ చంద్రశేఖరరావు

పూసపాటిరేగ: కొబ్బరి సాగులో బహుళ అంతర పంటల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ చంద్రశేఖరరావు అన్నారు. ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా మండలంలోని చింతపల్లి గ్రామంలో కోకోనట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మొంగం శ్రీనివాసరావు అధ్యక్షతన కొబ్బరి రైతులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలో అత్యధికంగా కొబ్బరిసాగు జరుగుతోందని దీనిలో అంతర పంటలు వేసుకుంటే అనేక లాభాలు అని తెలిపారు. నీటి సదుపాయం ఉన్న తోటల్లో కోకోసాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. హెక్టారు సాగుకు ప్రభుత్వం 30 వేల రాయితీ ఇస్తోందన్నారు. అనంతరం కొబ్బరి అభివృద్ధి బోర్డు పథకాలను వివరించారు. కార్యక్రమంలో రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ చంద్రశేఖరరావు

పైడితల్లి జాతర పనులు పూర్తి చేయండి

విజయనగరం: పైడితల్లి జాతర ఏర్పాటు పనులను ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై ఆయన తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశమై మాట్లాడారు. ప్రధానంగా నగర సుందరీకరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, దీనిలో భాగంగా నగరవ్యాప్తంగా ఉన్న డివైడర్ల గ్రిల్స్‌కు రంగుల అద్దే పనిని శరవేగంగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడా వీధిదీపాల సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరమత్తులకు గురైన వీధి దీపాలను తక్షణమే సరిచేయాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విపణికల్ప ప్రాంతంలోని కార్పొరేషన్ స్థలాన్ని చదును చేసి విజయనగర ప్రముఖుల వివరాలతో కూడిన చిత్రమాలికను(ఫొటో ఎగ్జిబిషన్) ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పలు ప్రాంతాలలోని గోడలకు చిత్రాలతో కూడిన పెయింటింగ్ వేయించాలన్నారు. సమావేశంలో ఎంఈ ప్రసాదు, ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ పల్లి నల్లనయ్య

సకాలంలో ఎఫ్ఆర్ఎస్ వేయాలి

విజయనగరంఫోర్ట్: ఆరోగ్య మిత్రలు సకాలంలో ఎఫ్ఆర్ఎస్ వేయాలని ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ కుప్పిలి సాయిరాం సూచించారు. స్థానిక జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలోని ఆరోగ్యశ్రీ డెస్క్‌ను ఆయన మంగళవారం సందర్శించి, అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ప్రతిరోజూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించాలన్నారు. వారిని ఎవరైనా డబ్బులు అడిగారా, లేదా వైద్యానికి ఏమైనా ఖర్చు చేశారా అనే వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. వారికి నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా మేనేజర్ దూబ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ సాయిరాం

నిమజ్జనాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలి

విజయనగరం క్రైమ్: వినాయక నిమజ్జనాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు. ఇదే విషయమై ఆయన మంగళవారం ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడి, సూచనలు చేశారు. నిమజ్జనానికి విగ్రహాలు తరలించేటప్పుడు ఎవరికీ ఏ ప్రమాదం జరగకుండా ఉండేలా ఏర్పాట్లు ఉండాలని ఆ దిశగా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని ఎస్పీ తెలిపారు. ఊరేగింపు సమయంలో.. నిమజ్జనం సమయంలో ఎటువంటి ప్రాణాపాయం జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించేలా నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు.



ఎస్పీ వకుల్ జిందల్

సమాజసేవలో యువత తరించాలి

విజయనగరం టౌన్: సమాజ సేవలో యువత తరించాలని వాసవీ క్లబ్ అధ్యక్షుడు విజ్జపు విజయకుమార్ అన్నారు. వాసవీ క్లబ్ వారోత్సవాల్లో భాగంగా కొత్తపేట కుమ్మరివీధిలోని స్వామీ వివేకానంద ప్రాథమికోన్నత పాఠశాల ఐదో తరగతి విద్యార్థులకు జవహర్ నవోదయ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ మెటీరియల్ తెలుగు, ఇంగ్లిష్ పుస్తకాలను మంగళవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువును సత్కరించడం, వృద్ధులను సముచితరీతిన గౌరవించుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విజయనగరం క్రైమ్: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీమ్ హెడ్ విజయ సూచించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండకరకాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గంజాయి, ఖైనీ, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఫ్యాషన్ ప్రపంచంలో పడి చాలామంది చెడు అలవాట్లకు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుని వారి కుటుంబాలకు విషాదం మిగుల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు.